ఆలయ ఆవరణలో తేరును లాగుతున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో తేరు రథోత్సవం

కడ్తాల్, నవంబర్ 16: మండల పరిధిలోని మైసిగండిలో కొలువైన మైసమ్మతల్లి జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం రెండో రోజు అమ్మవారిని భక్తులు దర్శించుకొని అర్చనలు, విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం చిన్న రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అందంగా అలకరించిన తేరులో దేవతామూర్తుల విగ్రహాలను ఉంచి, ఆలయ ఆవరణలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శిరోలీపంతూనాయక్, ఈవో స్నేహలత, తహసీల్దార్ జ్యోతి, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

వాహన చట్టాలపై అవగాహన పెంచుకోండి

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి

ట్యాక్సీ వాహనదారులు, డ్రైవర్లకు ఏసీపీ రంగస్వామి సూచన

వాహనదారులు, ట్యాక్సీ డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్, నవంబర్16: ప్రమాదాల నివారణ, సురక్షిత ప్రయాణాలను కొనసాగించాలంటే ట్యాక్సీ వాహనదారుల యజమానులు, డ్రైవర్లు కచ్చితంగా వాహన చట్టాలు, శిక్షలు, నిబంధనలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి సూచించారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలో ట్యాక్సీ వాహనదారులు, యజమానులు, డ్రైవర్లకు వాహన చట్టాల అమలుపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. బీఎన్ఎస్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, నిబంధనలను అతిక్రమిస్తే శిక్షలు, జరిమానాలపై కనీస అవగాహన ఉండాలని చెప్పారు. ఎక్కడైనా అనుమానాస్పదస్థితిలో గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతున్నా, కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, ఎంవీఐ వాసు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, నవంబర్16: నియోజకవర్గంలోని పేదలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో పలువురి లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేసిన అనంతరం మాట్లాడారు. నియోజకవర్గంలోని 117 మంది లబ్ధిదారులకు రూ. 35 లక్షల 38వేల 500 చెక్కులను అందజేశామని పేర్కొన్నారు. అదేవిధంగా నందిగామ మండలానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు రూ. 26 లక్షల 3వేల 116 కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, అర్హత కలిగిన వారు కచ్చితంగా సంక్షేమ పథకాలను పొందాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎదురయ్యే సమస్యలను నేరుగా తమ దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

కొత్తూరు: కొడిచెర్లలో నిర్వహిస్తున్న సర్వేలో పాల్గొన్న ఎంపీడీవో అరుంధతి

కడ్తాల్: రావిచేడ్ గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో విజయ్‌కుమార్‌పాల్

కడ్తాల్, నవంబర్ 16: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని మండల పంచాయతీ అధికారి విజయ్‌కుమార్‌పాల్ అన్నారు. మండలంలో ఎన్యుమలేటర్లు చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతుంది. శనివారం రావిచేడ్ గ్రామంలో చేపట్టిన సర్వే ఎంపీవో పరిశీలించి మాట్లాడారు. సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా చేపట్టాలని సూచించారు. కుటుంబ సభ్యులు చెప్పే వివరాలన్నింటినీ జాగ్రత్తగా నమోదు చేయాలని తెలిపారు. సర్వేలో ఎలాంటి పొరబాట్లు జరగకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

3,126 కుటుంబాల సర్వే పూర్తి

కొత్తూరు : కొత్తూరు మండల వ్యాప్తంగా శనివారం వరకు 3,126 కుటుంబాల సర్వే పూర్తయిందని ఎంపీడీవో అరుంధతి తెలిపారు. మొత్తం మండల వ్యాప్తంగా నవంబర్ 9న ప్రారంభమైన కులగణన సర్వే కొనసాగుతుందని వివరించారు. మండల వ్యాప్తంగా 5,815 కుంటుబాలను సర్వే చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. ఇందుకోసం మండల వ్యాప్తంగా 12 గ్రామ పంచాయతీల్లో 6 మంది సూపర్‌వైజర్లు, 55 మంది ఎన్యూమరేటర్లు పనిచేస్తున్నారని ఆమె వివరించారు. కొడిచెర్లలో జరిగిన సర్వేలో ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో విజయలక్ష్మి, ఎంపీఎస్‌వో రాజేశ్వరి పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 14 పరీక్షా కేంద్రాలు

హాజరుకానున్న 15,958మంది అభ్యర్థులు

పటిష్ట పోలీసు బందోబస్తు : ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 16 : ఆది, సోమవారాల్లో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షలకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సందర్భంగా గ్రూప్-3పరీక్షల కోసం ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో 14పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో నిర్వహించే 14 కేంద్రాల్లో 15,958మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నంతో పాటు ఆదిబట్ల పరిధిలో గురునానక్, శ్రీఇందు, సిద్ధార్థ, శ్రీదత్త, సీవీఆర్, ఎంఆర్ఎం, ఏవీఎన్, కేశవ్ మెమోరియల్, భారత్, ఎంవీఎస్ఆర్, విశ్వేశ్వరయ్య, హెచ్ ఆర్‌డీ, ఆదిబట్లలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో కేంద్రాలు కొనసాగనున్నట్లు తెలిపారు.

షాద్‌నగర్‌లో 7 కేంద్రాలు

షాద్‌నగర్ : గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3.00 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని గ్రూప్- 3 పరీక్షల నిర్వహణ షాద్‌నగర్ రూట్ ఆఫీసర్ సత్యకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో మొత్తం ఏడు పరీక్షా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఠాగూర్ హై స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజేత జూనియర్, విశ్వ భారతి జూనియర్, శ్రీ చైతన్య హై స్కూల్, బ్రిలియంట్ హై స్కూల్, భాష్యం హైస్కూల్‌లో ఉంటుందని చెప్పారు. వీటిలో 2500 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తారని, 70 మంది పోలీసులతో బందోబస్తు ఉంటుందని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. నలుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని ఏసీపీ పేర్కొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువాలి

తిమ్మారెడ్డి గూడ పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేస్తున్న ఎంఈవో లక్ష్మణ్‌నాయక్

షాబాద్, నవంబర్ 16 : విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదుగాలని షాబాద్ మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ నాయక్ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డి గూడా ప్రాథమికోన్నత పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు భావిభారత నిర్మాతలని, వారి ఉజ్వల భవిష్యత్తుకు బీజాలు పాఠశాల స్థాయిలో పడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం జ్యోత్స్న, మాజీ సర్పంచ్ మద్దూరి శకుంతల పాండు, పీఆర్టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు డేవిడ్‌రెడ్డి, కృష్ణ, ఉపాధ్యాయులు మహాదేవి, అరుణ, శ్రీనివాస్, గోవింద్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మధ్యాహ్న భోజనంలో కొరవడిన నాణ్యత

షాద్‌నగర్‌రూరల్, నవంబర్ 16 : ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి సరిపడా నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు శనివారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ప్రభుత్వం కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకపోవడంతో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఒక్కో విద్యార్థికి కేవలం రూ9.95 మాత్రమే చెల్లిస్తుందని, ఇవి సరిపోవడం లేదన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్న భోజనానికి సరిపడా నిధులను కేటాయించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు సుమయిర్, శివశంకర్, అస్మాన్, షైబాజ్ పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర దీపాలంకరణ

హాజరైన మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

దండుమైలారం పురాతన శివాలయంలో సహస్ర దీపాలంకరణలో పాల్గొన్న భక్తులు

ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ సునితారెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 16 : ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని దండుమైలారం గ్రామంలో ఆలయ అనువంశిక ధర్మకర్త రావి నూతల వంశీధర్ ఆధ్వర్యంలో కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి పురాతన శివాలయంలో సహస్ర దీపాలంకరణ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రుద్రాభిషేకం, స్వామివారి అలంకరణ, అర్చన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ దీపాలంకరణ మహోత్సవానికి మహేశ్వరం డీసీపీ హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కుటుంబీకులు శశిధర్, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, భజన బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలలకు ప్రిన్సిపాల్స్, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ పదవుల్లో కొత్త వారిని నియమించిన నేపథ్యంలో వారు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కాశీం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జి.ప్రభాకర్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఐ.శేఖర్, లా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాంప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఆదిబట్ల, నవంబర్ 16: నేడు నాదర్‌గుల్ సబ్‌స్టేషన్ పరిధిలోని టీఎస్ఐఐసీ ఆదిబట్ల సేజ్ ఫీడర్ మీద 11కేవీ లైన్ కు తాకే చెట్ల కొమ్మలను ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తొలగించడం జరుగుతుందని ఆదిబట్ల విద్యుత్ ఏఈ జయన్న తెలిపారు. దీనికి సంబంధించి ఆదిబట్ల సేజ్ పరిసర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

20న ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు, నవంబర్16 : ఈ నెల 20న లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఆమనగల్లు ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌వో పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి శుక్లాలు, కంటి చూపు మందగించిన వారు, కంటి సమస్యలు ఉన్న వారందరూ ఆధార్‌కార్డు, రేషన్ కార్డు తీసుకుని ఈ శిబిరానికి హాజరుకావాలని వారు సూచించారు.

రేపటి నుంచి రిలే దీక్షలు

యాచారం, నవంబర్16: ఆసరా పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18నుంచి 23వరకు అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆసరా పింఛన్లు పెంచుతామని చెప్పి అధికారంలోకి రాగానే దివ్యాంగులను విస్మరించిందన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ.4016, దివ్యాంగులకు రూ.6016 వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసరా పింఛన్ పెంచేవరకు సర్కార్‌పై పోరాడుతామన్నారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

అక్రమ నిర్మాణం కూల్చివేత

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 16: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేదిలేదని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి స్పష్టంచేశారు. మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని 73 సర్వేనంబర్‌లోని స్థలాన్ని హౌసింగ్‌బోర్డుకు కేటాయించగా.. అక్కడ చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని శనివారం రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. ప్రభుత్వ భూములు ఎవరైనా కబ్జా చేసినట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

తుర్కయాంజాల్, నవంబర్ 16 : రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు పని చేస్తాయని తుర్కయాంజాల్ రైతుసేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా శనివారం తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో వ్యవస్థాపక, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి ప్రోత్సహించడంలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి, యాదగిరి, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ, సెక్రటరీ రాందాస్ పాల్గొన్నారు.

రోడ్డు పక్కన సంతతో ఇక్కట్లు

ఇబ్బందుల్లో వ్యాపారులు.. స్థలం కేటాయించాలని వేడుకోలు

రోడ్డు పక్కన క్రయ విక్రయాలు నిర్వహిస్తున్న వ్యాపారులు

కందుకూరు, నవంబర్ 16 : మండల కేంద్రంలో ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. కందుకూరు, హైదరాబాద్, శ్రీశైలం రహదారిపై కందుకూరు మండల కేంద్రం ఉండటంతో అంచలంచెలుగా అభివృద్ధి చెంది వాణిజ్య కేంద్రంగా ఎదిగింది. దీంతో పంచాయతీ పాలకవర్గం ప్రతి ఆదివారం సంత నిర్వహించడానికి నిర్ణయించింది. కూరగాయాలు, వ్యాపారంతో పాటు మేకలు, గొర్రెల సంతను కూడా నిర్వహిస్తున్నారు. ఈ సంత ప్రతి ఆదివారం కందుకూరు యా చారం మండల కేంద్రానికి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా నిర్వహిస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నారు. లక్షల్లో వ్యాపారం కొనసాగుతుంది. రోడ్డు పక్కన వ్యాపారం నిర్వహిస్తుండటంతో వ్యాపారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వ్యాపారం చేస్తున్నారు. సంత నిర్వహించడానికి స్థలం లేదు. మేకల,గొర్రెల సంతను ప్రైవేట్ వెంచర్‌లో నిర్వహిస్తున్నారు. అది ప్రైవేట్ స్థలం కావడం అక్కడ కనీస వసతులు లేవు. వ్యాపారస్తులు, క్రయ విక్రయదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సరం వేలం ద్వారా పంచాయతీకి లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికి కనీసం వసతులు కల్పించకపోవడం పై వ్యాపారస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థలం కేటాయించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

మూసీ బాధితులకు

అండగా ఉంటాం

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 16: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు బీజేపీ ముందుండి పోరాడుతుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అత్తాపూర్, హైదర్‌గూడ మూసీ పరీవాహక బాధితుల కోసం ఒక రోజు నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ పరిసర ప్రాంతాల్లో బాధితుల ఇంటికెళ్లి భరోసా కల్పిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు పక్కన పెట్టి రేవంత్‌రెడ్డి చేస్తు న్న నీతిమాలిన వ్యాఖ్యలు మీరు వెళ్లి అక్కడ మూసీ ప్రాంతంలో నిద్ర చేసి రండి అని చెప్పడం దానికి దీటుగా ప్రజలకు భరోసా కల్పిస్తూ బీజేపీ నాయకులంతా కలిసి పరిసర ప్రాంతాల్లో బస చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ కర్కశ పాలనలో పేదలకు గూడు-నీడా దూరమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జనార్దాన్‌రెడ్డి, ప్రేమేందర్ రెడ్డి, మోం డ్ర కొమురయ్య, అంజన్‌కుమార్ తదితరులున్నారు.

మూసీ బాధితులతో మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్

పాఠశాలల అభివృద్ధికి ముందుకు రావాలి

హెచ్ఎం శ్రీనివాస్‌కు చెక్కును అందజేస్తున్న దాతలు

మన్సూరాబాద్, నవంబర్ 16: పేద ప్రజలు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని ఉప్పల మండల విద్యాధికారి రామారావు కోరారు. నాగోల్ డివిజన్ పరిధి జైపురి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం సంగారెడ్డి జిల్లా కల్లేరు ఎంఈవో గంజి శ్రీనివాస్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మల్లేశ్ రూ. 8 వేల చెక్కును ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రామారావు మాట్లాడుతూ క్వాలిఫైడ్ టీచర్ల విద్యాబోధనలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎంతో మంది ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు బ్యూల పాల్గొన్నారు.

విద్యార్థులకు వేగంగా చదవడంపై పోటీ

ప్రభుత్వ డిగ్రీ గ్రంథాలయ వారోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

హయత్‌నగర్, నవంబర్ 16 : చిరిగినా చొక్కానైనా తొడుక్కో.. కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో అని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. శనివారం గ్రంథాలయ సమాచార కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పీడ్ రీడింగ్, క్విజ్ కాంపిటీషన్ నిర్వహించామని తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాష ల్లో వేగంగా చదవడం లో విద్యార్థులు పోటీపడ్డారని, చక్కగా ఈ స్పీడు రీడింగ్ ద్వారా విద్యార్థులు అక్షర దోషాలు లేకుండా చదవడంలో మంచిపట్టును సాధించొచ్చని, జనరల్ నాలెడ్జ్‌పై పోటీలు నిర్వహించామని కళాశాల గ్రంథపాలకులు డాక్టర్ ఆనంద్ దుర్గా ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ చదవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ నాగరాజు, నర్సయ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో

పూర్వ విద్యార్థుల పాత్ర కీలకం

మన్సూరాబాద్, నవంబర్ 16: నాగోల్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమైందని నోసా ప్రెసిడెంట్ కందికంటి కన్నాగౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సత్యనారాయణ తెలిపారు. నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు అనంతుల వేణుగోపాల్‌గౌడ్, కొత్త జగన్ సంస్మరణ సభను నోసా ఆధ్వర్యంలో శనివారం నాగోల్ చౌరస్తాలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు నోసా సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెండు వెంకట్‌రెడ్డి, బొడ్డుపల్లి సురేశ్, ప్రదీప్‌కుమార్, సిద్ధి రమేశ్, నాళ్ల ఉమామహేశ్వర్ గుప్తా, లింగంగౌడ్, వర్కల బాలరాజు, అనంతుల శ్రీనివాస్, నల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి

పోరాడుతాం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి

చేవెళ్లటౌన్, నవంబర్ 16: పేదలకు అండగా సీపీఐ నిలుస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి తెలిపారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలో సీపీఐ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను నీరుగార్చడంతో పాటు వారికి హక్కులు లేకుండా చేశారని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సీపీఐ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.